కథానిక

# ఘరానా దొంగ

ఓగేటి శివరామకృష్ణ

ఉదయం తొమ్మిది గంటలవేళ...

"అవధాన్లుగారూ?" అంటూ కొంప మునిగి పోయినట్లుగా వీధిలోంచి కేక వేశాడు విశ్వం.

"ఎవరది?" అంటూ వీధిలోకి వచ్చాడు అవధాన్లు.

"నేనండీ విశ్వాన్ని."

"ఇదేమిటి యిలా వచ్చారు... ఊరకరారు మహానుభావులు?"

"మీబోటి పెద్దల దగ్గరకు పూరికే వస్తామా?" అన్నాడు విశ్వం.

"ముందే అడ్డుమాట పడేశారే. సరే. అలా నిల్చుండిపోయారేమిటి. రండి లోపలకు పోయ్ కూర్చుందాం" అంటూ ఇంట్లోకి తీసుకుపోయాడు అవధాన్లు.

"ఖర్చయితే అయిందిగాని మా బాగుగా కట్టారండి!" అన్నాడు యింటిని పరిశీలిస్తూ విశ్వం.

"యిరవై వేల రూపాయలు ఖర్చయినప్పుడు గట్టితనానికేం" అన్నాడు అవధాని గదిలో వున్న ఒక కుర్చీలో తాను కూర్చొని, విశ్వానికి మరోటి చూపిస్తూ.

"ఖర్చయింది కాబట్టే గట్టితనం!" అన్నాడు విశ్వం కుర్చీలో కూర్చుని.

"అవును. అలాగే కట్టించాలి. చిరకాలం వుండేలా కట్టించారు! ఇనప్పెట్టెలాగే వుంది. డబ్బు శాశ్వతంటండీ" అన్నాడు విశ్వం.

"ప్రహరీగోడ గూడా మంచి యెత్తున కట్టించారు. ఊరికీ యింటికి దూరమయినా మీ యిల్లు యినప్పెట్టేనండి" అవసరాన్ని పురస్కరించుకొని అన్నాడు విశ్వం.

"మీరన్నమాట నిజమేనండి. అందువల్లనే చీకూచింతా లేకుండా హాయిగా నిద్ర పోతున్నాం-దొంగల భయం మాకేం లేదు" అన్నాడు అవధాని గొప్పగా.

"అవును. అందుకనే!" మనస్సును చిక్కబట్టుకొని అన్నాడు విశ్వం.

"ఊరికి యింటితో సంబంధం లేకపోయినా యేదో చిన్నదయినా ఫేష్‌గా కుదిరిందికదండీ!"

"అవునండి!" అన్నాడు అవధాని.

"అందువల్లనే చీకూచింతా లేకుండా వుండ గలుగుతున్నాం. మీరన్నట్లుగా యినప్పెట్టిలాగే వుంది." గొప్పగా తన యింటిని పొగుడుకొన మొదలు పెట్టాడు అవధాని.

"అవునండి. ఈ వూళ్లో వున్నవాటిల్లో మీ యిల్లే కట్టుదిట్టంగా వున్నది. మీకెటువంటిభయం వుండదు" అన్నాడు విశ్వం.

"అవునందువల్లనే చీకూచింతా లేకుండా నిర్భయంగా సంచరించగలగుతున్నాం. ఇంట్లో ప్రవేశించిన చీమయినా, మన కళ్ళకు కన్పించకుండా ముందుకు పోటానికి వీల్లేదు" అన్నాడు అవధాని తిరిగి పాత మాటల్ని.

"అవునండి. అదృష్టవంతులు గనక మీరు చీకూచింతా లేకుండా నిద్రపోకలుగుతున్నారు. దురదృష్టవంతులం గనక రాత్రింబవళ్లు మేం జగారాలు చేస్తున్నాం."

"అదేమిటి?" తెలియనట్లు అన్నాడు అవధాని.

"ఏముందండి. ఏదో పెద్ద దొంగల ముఠా వూళ్ళో ప్రవేశించింది. ఎక్కడవున్నారో, ఎలా వుంటారో యేలా చేస్తున్నారో యెవళ్ళకూ తెలియదు. కాని దొంగతనాలు మాత్రం గత వారం రోజుల్నుంచీ, క్రమంగా జరుగుతూనేవున్నాయి. పట్టుకోలేకపోతున్నాం."

"నాకాసంగతే తెలియదండీ!"—ఆశ్చర్యం ప్రకటిస్తూ అన్నాడు అవధాని.

"అవును! మీకు వూరితో సంబంధం ఏముంది గనక, మీకు మైలు దూరంలో మేంవున్నాం."

"దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయన్న మాట!"

"జరగటమేమిటండీ... మా కళ్ళు కాయలు కాసేలా, కళ్ళు తెరచుకు ఒకమూల కాపలా కాస్తుండగానే, ప్రక్కనుంచి, కన్నుకప్పి వాళ్ళ పనివాళ్ళు చేసుకుపోతున్నారు."

"విచిత్రంగా వుంది!"అన్నాడు అవధాని.

"ఇనప్పెట్టిలాంటి కొంపలోవున్న మీకు విచిత్రంగానేవుంటుంది. వాళ్లుచేసే తమాషా చూడండి- ఒకళ్ళయింటితర్వాత మరోయింటికి పరుగెడుతున్నారు. వాళ్ళకేదో కార్యక్రమం వుందండీ. ఇంతవరకు వరసగా, ఇంజనీరుగారింట్లో బంగారం; ప్లీడరుగారింట్లో వెండి, డాక్టరుగారింట్లో రొక్కం పూర్తిచేశారు. వాళ్ళ కార్యక్రమప్రకారం నేడో రేపో మాయిల్లుట!"

"మీకుగూడా డేటు ఫిక్సయిపోయిందన్నమాట!" హేళనగా నవ్వుతూ అన్నాడు అవధాని.

"వూరంతా ఒకేలా అనుకొంటూంటే—నలుగురుగూర్చి ఆ మాటవచ్చినప్పుడు జరక్కుండా వుంటుందంటారా... నిజంగా మా చెడ్డభయం వేస్తూంధండి. అందుకనే మీతో మాటాడిపోదామని వచ్చాను."

"ఏనుగుల్లాంటివాళ్ళు మీకు భయంయేమిటిలెండి. అయినాకా ఏలా నిద్రాహారాలు మానుకొని కాస్తున్నారుగా!"

"అంతాకాశాం; కాస్తున్నాం; కాస్తాం; ఏమయినా వాళ్ళపనివాళ్ళు-మా కళ్ళపడకుండా సాగించుకుపోతూనేవున్నారు. అందుకనే బెంగగా వుంది సరిగ్గా మెతుకులయినా ముట్టడంలేదు"— అన్నాడు విశ్వం!

"అవునులెండి. నిలవచేసివున్న వాళ్లకు భయం" హేళనగా నవ్వాడు అవధాని.

"మీరు ఇనప్పెట్టిలాంటి ఇల్లు సంపాదించుకొన్నారుకాబట్టి అలా వేళాకోళం చేస్తున్నారు. మేం యెంత బాధపడుతున్నామో... మీరీ సమయంలో సహాయంచేయక తప్పదు."

"నన్నుగూడా మీ ఇంటికి కాపలాకి రమ్మంటారా?"—నవ్వుతూ అన్నాడు అవధాని.

"ఎంతమాట! ఆమాత్రంమాటన్నారు చాలు!"

"ఒకళ్ళకొకళ్ళం సహాయం చేసుకోటానికేకదండి మనం! అదేం పెద్దవిషయం!"

"మీది విశాలహృదయం! అదికాదు..."

"చెప్పండి..."

"ఏవిధంగా ఆలోచించినా, నాకింతకంటె మరిమార్గం కనిపించటంలేదు. అందువల్ల అభ్యంతరం చెప్పకుండా, నామాట మీరు పాటించాలి!"

"సంగతి యేమో చెప్పకుండా నన్ను యిరుకున పడేస్తున్నారు.

"ఏం చెప్పను?..." నాన్చుతూ అన్నాడు విశ్వం.

అవధాని విశ్వంవైపు ఎగాదిగా చూశాడు.

"ఈ సందర్భంలో మీరు నామాట కద్దు చెప్పగూడదు."

"ఏమిటో చెప్పండి అసలు."

"నాదగ్గర కొంత రొక్కం వుంది. అది మీరు దాచిపెట్టాలి! మా పరిసర పరిస్థితులు తిన్నపడ్డ తర్వాత తీసుకుపోతాను."

"అయ్యబాబో...సొమ్మా? ఏమాత్రం?"

"ఏమాత్రమోనా నాలువేలు నే దాచటానికి వీళ్ళెక్కడ ఇనప్పెట్టెలాంటి యిల్లు కట్టుకొన్న మీరు నాకు గుర్తుకొచ్చారు. మీకంటె నాకీ సమయంలో సహాయం చేసేవారు మరెవరూ లేరు."

"నాకు భయం...నన్నీ సందర్భంలో నిర్బంధించకండీ!"

"ఇనప్పెట్టెలో సొమ్ము మీదగ్గర సొమ్ము ఒకటి నాకోర్కె తీర్చి తీరాలి."

"విశ్వంగారూ క్షమించాలి!"

"బ్యాంకులోకంటెజాగ్రత్తగా మీరు సొమ్ము దాచగలరని నా అంతర్వాణి చెబుతూంది. కష్టసమయంలోవున్న నన్ను మీరు రక్షించాలి".

"మీరు నిర్బంధించకండి నాకు చాలా బాధగావుంది!"

"వెండిసామాను సహితం మీ యింటనే తెచ్చిపెట్టుదామనుకున్నాను. కాని నిన్నటిదినం మా కుర్రనాడువచ్చి- సమానంతా యిక్కడనుంచి తీసుకుపోయాడు పట్నం; రొక్కంమాత్రం మిగిలింది."

"రొక్కంగూడాయిచ్చేయలేక పోయారా?"

"రొక్కం యివ్వటానికి యిష్టంలేకపోయింది. పైగామీరు జ్ఞప్తికొచ్చారు నామాట కాదనరనే ధైర్యం నాకప్పుడే కలిగింది!"

"నాలుగువేల రూపాయలు యీ పూరి గుడె

సేలో దాచటం సాధ్యంకాదు. మీలాగే నాకూ భయం!"

"అలాగనకండి. మీది యినప్పెట్టె."

"ఏమో బాబూ! నాకూ భయంగావుంది. మరోవిధంగా అనుకోకండి."

"మీమీద ఆశపెట్టుకు వచ్చాను. మరో విధంగా అనకండి."

"నేనూ మీలాంటివాడినే. నాయింటి వస్తువులమీద నాకు బాధ్యత వున్నట్టుగానే, మీ మీద మీ వస్తువులమీద చూపచ్చు కాని కాలం కర్మం కలసిరాకుంటే యేంచేసేది చెప్పండి? నాకూ మీరు చెప్పినప్పటినుంచి చెడ్డ భయంగా వుంది!"

"కాలం కర్మం కలసిరాకుంటే మీరేంచేస్తారు లెండి!"

"అ...అలా అనకండి. ఇంతవరకూ నా అదృష్టం బాగున్నదనుకోండి. కాని కాలం కర్మం కలసివస్తే నాకూ దెబ్బ తగలచ్చు; అలాంటప్పుడు మీలాంటివాళ్ళకు సహితం దెబ్బ తగలటం జరగచ్చు; అందువల్ల యితరుల సందర్భంలో బాధ్యత నెత్తిన పెట్టుకోటం శ్రేయస్కరం కాదు."

"అలా అనకండి. మీతోబాటే మేమూను" అన్నాడు విశ్వం.

"అ...అ...అవేంమాటలు... నా నష్టం నే భరించటం సహజం..." అవధాని ఆలోచిస్తూ అన్నాడు.

"ఆ అంతేలెండి! ఎవళ్ళనష్టంవాళ్లు భరించటంగూడా సహజం" అన్నాడు విశ్వం.

"అవుననుకోండి. అయితే యిప్పుడు తోచినట్లుగా అప్పుడు తోచదు" అన్నాడు అవధాని.

"మీయిల్లు ఒకయినప్పెట్టె. మీయింట్లో వస్తువు చెక్కుచెదరదనే నా నమ్మకం."

"నాకూ అలాటివుద్దేశమేవుంది. అందువల్ల మీసొమ్ము దాచటానికిగూడా నాకభ్యంతరం యెట్టిదీవుండదు. కాని అది సమయాన్ని పురస్కరించుకొని యేలా తయారవుతుందోనని నా భయం."

"దానికి మీరేంచేస్తారు! సాధ్యమయినంత వరకూ యెటువంటికష్టమూ సంభవించదనే భావిద్దాం."

"యింతగా మీరు చెపుతున్నారు; కాదనటానికి మనస్సు ఒప్పటంలేదు. మరోమారు చెబుతున్నాను...యేర్పడబోయే పరిస్థితులకు యెటువంటి బాధ్యతా నానెత్తినిమాత్రం పెట్టకండి"

"నాకుమాత్రం తెలియదుదండీ!"

"సరే - ఒకమాట-సాధ్యమయినంత త్వరలో మీసొమ్ము తీసుకుపోవాలి."

"అలాగే! కొంచెంప్రశాంతతయేర్పడ్డంతోటే" అంటూ బొడ్డునపెట్టిన సంచీతీసి—నోట్లకట్టలు అవధాని ముందుంచాడు.

"నాకూ మా చెడ్డభయంగా వుంది. మీమాట తీసేయలేక పుచ్చుకుంటున్నాను" — అంటూ అవధాని నోట్లను లెక్కపెట్టసాగాడు.

"మాట తీసేయకుండా నాకోర్కె తీర్చారు. మీరుణం యేలాతీర్చుకోవాలో యేమో!" అన్నాడు విశ్వం.

"మీనోట్లు మీకివ్వటం జరిపితే చాలు... ఇక మీదమీరు నిశ్చింతగా పడుకొన్ని, నన్ను మాయింటిచుట్టూ కాపలా కాయిస్తారన్న మాట!"

"ఎంతమాటన్నారు!"

"అదికాదండీ! మీ డబ్బువిషయంలో యేపరిస్థితుల్లోనయినా బాధ్యత మీదేనని మీరువప్పుకొన్నా యెటునుంచి యెటువస్తుందోనని గుండె దడదడలాడుతోంది"

"అవేంమాటలండీ! ముష్టినాలుగు వేలకు యిన్ని కబుర్లు చెతారు? మీచేతుల్లోంచీ రోజూ యెన్ని వేలు పరుగు పెట్టటంలేదు!"

"అంతేలెండి" అన్నాడు అవధాని.

"దయవుంచండి... మరి నేవెళ్ళిరానా!" — లేవబోయాడు విశ్వం.

"ఆ...ఆగండి. మీడబ్బు—ఇదిగో యీబీరువాలో నాడబ్బుతోపాటే దాస్తున్నాను. రోజూ వచ్చి తణిఖీచేసుకు పోతూండండి"

"మీమీదనాకు నమ్మకం వుందండి!"

"పాపిష్టిడబ్బు! మనుష్యుల మనస్సులు మార్చటము యెంతసేపు" అన్నాడు అవధాని.

"ఆ సూత్రం యెవరికట్లయినా మాత్రం... మీకుమాత్రం అన్వయించదు!" అన్నాడు విశ్వం బయలుదేరుతూ!

"రోజూవచ్చి చూసుకుపోతూండండి...మీ డబ్బుమీద నేచెయ్యికూడా వెయ్యను, తెల్సిందా" అన్నాడు అవధాని, బీరువా తాళంవేస్తూ.

"వస్తా!" అంటూ లేచాడు విశ్వం.

పడకకుర్చీలో పడుక్కొని—కొత్త ఆలోచన చేయసాగాడు అవధాని.

* * *

మర్నాడు విశ్వం యోగక్షేమం చేయటానికి యింటికివచ్చాడు,

"రాండండి! మీ నోట్లకట్టలు" అంటూ గదిలోకి తీసుకుపోయి బీరువా చూపించాడు అవధాని.

"మీ నోట్లు మీ చేతికిస్తే చాలుననుకొంటున్నాను" అన్నాడు అవధాని.

"ఏదేమిటండీ...మీబోటి పెద్దలే అలా భయపడుతుంటే—మాబోటివాళ్ళ గతేంకాను?"—అన్నాడు విశ్వం!

"ఎంత మీరు బాధ్యత మీదిగొట్టుకొన్నా—నాను రాత్రి కాపలా తప్పలేదు" విశ్వం నవ్వుతూ అన్నాడు.

"విశ్వంగారూ మీసొమ్ము మీరు తీసుకుపొండి" అన్నాడు అవధాని.

"అదేమిటి" అన్నాడు ఆశ్చర్యం వెల్లడిస్తూ విశ్వం.

"ఏంలేదు. ఈరోజు మా ఆడవాళ్ళు పుట్టింటికెడుతున్నారు; వాళ్ళను రైలుయెక్కించి ఇంటికి వచ్చేసరికి పొద్దుపోతుంది. ఎందునించి ఎటు వచ్చినా మీసొమ్ము మీదగ్గరుంచుకోటంమంచిది. రాత్రికి వస్తాననుకోండి. కొంచెం ఆలస్యం అవుతుందంతే"

"రాత్రి మీరు తిరిగి వస్తారుకదండీ?"

"ఊఁ..."

"మరాలాంటప్పుడు—"

"ఏంలేదు. నాకొంచెం బాధ్యతవదలుతుందని—ఎంతమీరు నామీద వుంచకపోయినా, మనస్సువూరుకోటంలేదు"

"ఏం పరవాలేదు; ఉంచండి. వస్తాను!"—అంటూ నిష్క్రమించాడు విశ్వం.

"మనపాచికపారింది!" అంటూ ఒక్కనవ్వు నవ్వాడు అవధాని.

ఆ ప్రొద్దుట పదిగంటలకే అవధాని భార్యాబిడ్డల్ని వూరికిపంపించేనిమిత్తం బయలుదేరాడు; బయలుదేరుతూ తనతోగూడా ఇనప్పెట్టెలో దాచుంచిన సొమ్ముఅంతా తీసుకుపోయాడు.

* * *

మర్నాడు హుషారుగా విశ్వం అవధానిగారింటికి వచ్చాడు; వస్తూనే "అవధానిగారూ; క్రితంరాత్రి మాయింటికి కన్నంపడింది. ఏం దోచుకపోలేదులెండి. పాతచీరమాత్రం పట్టుకుపోయారు. మిమ్మల్నింక శ్రమపెట్టను" ఈ విధంగా అంటూ లోపలకు ప్రవేశించి నిర్ఘాంతపోయాడు...ఇనప్పెట్టి తెరిచివుంది!

అవధాని మంచానికి కట్టివేయబడ్డాడు;

"అబ్బ! అమ్మ" అంటూ తీవ్రంగా మూలుగుతున్నాడవధాని...

"ఏమిటిది ఏమిటిది?" అంటూ విశ్వం కూడా విడిపడుతూ కట్లు విప్పాడు.

"ఏముంది...అంతా అయిపోయింది. డబ్బంతా దోచుకుపోయారు. పొరపాటున వీధి గడియవేయలేదు. ఎలా ఎప్పుడు వచ్చారోయేమో! ఉన్నపళంగా తాళ్ళుపెట్టి కట్టేశారు. తాళంచేతులు తీసుకున్నారు; ఇష్టంవచ్చినట్లుగా చేశారు" అని మూలిగాడు అవధాని.

"అయ్యో!"—అన్నాడు విశ్వం.

"నీ నాలుగువేలే కాదయ్యా! నాపదివేలూను! ఏంచేస్తాం? అంతా కర్మని వూరుకోవలసిందే" అని వేదాంతం మాట్లాడాడు అవధాని మూలుగుతూ.

"అవును యేం చేస్తాం! పదివేలు యెన్నాళ్ళకు సంపాదించను. అందుకనే మీ బాధ్యతమీద అయితే వుంచండి అన్నా. ఏం అయితేనేం... వాటికి రోజొచ్చింది; వెళ్ళిపోయాయి" అన్నాడు అవధాని సావకాశంగా.

"అంతే!" అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు విశ్వం.

మహానగరం మనిషిని "నీదగ్గిర ఎంతడబ్బుంది?" అని అడుగుతుంది. ఓమాదిరి పట్నం "నీకు పనిపాటలేమైనా వచ్చా?" అంటుంది. పల్లెటూరు "నీ తల్లిదండ్రులెవరు?" అంటుంది.—(ఫ్రెంచి సామెత)